క్లుప్తంగా

అఖిల భారత పద్మశాలి సంఘం జిల్లా కార్యదర్శిగా శ్రీనివాస్



శాయంపేట : అఖిల భారత పద్మశాలి సంఘం హనుమకొండ జిల్లా కార్యదర్శిగా మండల కేంద్రానికి చెందిన వడ్డెపల్లి శ్రీనివాస్‌ను నియమించినట్లు ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వడ్నాల రవీందర్ శుక్రవారం శ్రీనివాస్‌కు నియామకపత్రాన్ని అందజేశారు. తన నియామకానికి సహకరించిన అఖిల భారత పద్మశాలి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వడ్నాల రవీందర్ రాష్ట్ర కార్యదర్శి వైద్యం రాజగోపాల్, జిల్లా అధ్యక్షుడు బచ్చు ఆనందం, ప్రధానకార్యదర్శి దిడ్డి రమేష్, జిల్లా ప్రచారకార్యదర్శి బాసాని బాలకృష్ణ, నాయకులు బత్తుల రవి, బూర సంతోష్, గడ్డం వెంకటేశ్వర్లుకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

సమ్మె నోటీస్

నడికూడ : మల్టీపర్పస్ వర్కర్ విధానం రద్దు చేసి, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ తెలంగాణ గ్రామపంచాయతీ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) జిల్లా అధ్యక్షుడు పల్లె రామన్న ఆధ్వర్యంలో ఎంపీడీఓ రవికి సమ్మె నోటీస్ అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ సమస్యలపై ప్రభుత్వం స్పందించకపోతే ఈ నెల 19 తర్వాత రాష్ట్ర వ్యాప్తంగా నిరవధిక సమ్మెను చేపడుతామని తెలిపారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు మామిండ్ల రమేష్, నాగరాజు, శంకర్, భాస్కర్,సురేష్ తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగాన్ని గౌరవించుకుందాం



శాయంపేట : మహాత్మగాంధీ, అంబేడ్కర్ రాజ్యాంగాన్ని గౌరవించుకుందామని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు దూదిపాల బుచ్చిరెడ్డి అన్నారు. మండలంలోని జోగంపల్లి, పెద్దకోడెపాక, గోవిందాపూర్ గ్రామాల్లో శుక్రవారం కాంగ్రెస్ నాయకులు జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా బుచ్చిరెడ్డి మాట్లాడుతూ అంబేడ్కర్ రచించిన రాజ్యాంగ విలువలపై అవగాహన పెంచడమే లక్ష్యంగా జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ పాదయాత్ర చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో చల్లా చక్రపాణి, పోలెపల్లి శ్రీనివాస్‌రెడ్డి, మారెపల్లి రవీందర్, చిందం రవి, అబ్బు ప్రకాష్ రెడ్డి, కుమారస్వామి, కృష్ణమూర్తి, డీటీ రెడ్డి, ప్రభాకర్, లక్ష్మీనారాయణ, శ్రీనివాస్, రజనీకాంత్, కుమారస్వామి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

భక్తుల మనోభావాలు దెబ్బతీయొద్దు



ఐనవోలు : దేవాలయానికి వచ్చే భక్తుల మనోభావాలు దెబ్బతినే విధంగా ప్రయత్నాలు చేయడం తద్వారా లబ్ధిపొందాలనుకోవడం శోచనీయమని తెలంగాణ రాష్ట్ర అర్చక ఉద్యోగ ఐక్య కార్యచరణ సమితి చైర్మన్ గంగు ఉపేందర్ శర్మ అన్నారు. శుక్రవారం మల్లికార్జునస్వామి ఆలయాన్ని ఆయన సందర్శించిన అనంతరం స్థానిక అర్చకులతో కలిసి మాట్లాడుతూ ఆలయ కార్యనిర్వహణ అధికారి, దేవాలయ సిబ్బంది, అర్చకులపై కొంతమంది వ్యక్తులు పనిగట్టుకుని అభాండాలు వేయడం పరిపాటిగా మారిందన్నారు. ఓ టెండర్‌దారు ఒక వస్త్రం విషయంలో ఆలయంలో విధులు నిర్వహిస్తున్న అర్చకుడిపై నిందలు వేస్తూ పోలీసులక ఫిర్యాదు చేయడమే కాకుండా రాజకీయ నాయకుల దగ్గరికి వెళ్లడం, మంత్రుల దగ్గరికి వెళ్లి ఫిర్యాదు చేస్తామని చెప్పడం దారుణం అన్నారు. ఆలయ వ్యవస్థకు పూజారి తనవంతు పాత్ర పోషిస్తున్నాడన్న విషయం అందరూ గమనించాలన్నారు. ఈ విషయాన్ని దేవాదాయ శాఖ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లడమే కాకుండా దేవాదాయ శాఖ మంత్రికి ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు. అర్చకుడిపై చేసిన ఆరోపణలు, అభియోగాలకు టెండరుదారు తక్షణమే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర అర్చక ఉద్యోగ ఐక్య కార్యాచరణ సమితి కార్యదర్శి తనుగుల రత్నాకర్ శర్మ, ఆలయ ఉప ప్రధాన అర్చకులు రవీందర్, ముఖ్యఅర్చకులు పాల్గొన్నారు.

పీఎస్‌ను సందర్శించిన డీసీపీ

మామునూరు: మామునూరు ఏసీపీ పరిధి లోని ఐనవోలు పోలీస్‌స్టేషన్‌ను శుక్రవారం సాయంత్రం ఏసీపీ తిరుపతితో కలిసి ఈస్ట్ జోన్ డీసీపీ అంకిత్‌కుమార్ ఆకస్మికంగా సందర్శించారు. స్టేషన్ పరిసరాలు, సిబ్బంది హాజరు పట్టిక రిజిస్ట్రార్‌ను పరిశీలించి, పెండింగ్ కేసుల వివరాలను ఎస్సై శ్రీనివాస్‌ను అడిగి తెలుసుకున్నారు. ఫిర్యాదుదారులపై మర్యాదగా మెలుగుతూ సమస్యలు పరిష్కరించాలని డీసీపీ సూచించారు.

పిల్లలకు ఆహ్లాదం కరువు

- నిర్వహణ నిర్లక్ష్యంతో ఆటలకు దూరం
- పాడైపోయిన ఆట వస్తువులు
- అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా ప్రకృతి వనం



నిరుపయోగంగా పిల్లల ఆట వస్తువులు



వాకింగ్ ట్రాక్‌లో పిచ్చిమొక్కలు

నడికూడ : పచ్చదనం పెంచడంతో పాటు ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించడానికి గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో గ్రామానికో పల్లె ప్రకృతి వనం ఏర్పాటు చేసింది. ఐదేళ్ల క్రితం గ్రామాల్లో ఉపాధి హామీ నిధులతో చేపట్టిన పల్లె ప్రకృతి వనంలో చాలా గ్రామాల్లో మొక్కలు ఏపుగా పెరిగి పచ్చదనంతో సంతరించుకుంది. కొన్నిచోట్ల గ్రామపంచాయతీ నిధులతో పిల్లలు ఆడుకోవటానికి పల్లె ప్రకృతి వనానికి అనుబంధంగా ఆడుకోవటానికి క్రీడా సామగ్రిని నెలకొల్పారు. కూర్చోవడానికి సిమెంట్ బెంచీలు ఏర్పాటు చేశారు. స్థానికులు రోజు సాయంత్రం ప్రకృతి వనాలకు వెళ్తూ ఆహ్లాదకర వాతావరణంలో కాసేపు గడిపేవారు. కొన్ని రోజుల నుంచి అధికారులు, పాలకుల నిర్లక్ష్యంతో చాలా చోట్ల ఎండిన మొక్కలు అస్తవ్యస్తంగా దర్శనమిస్తున్నాయి. మండల కేంద్రంలో విలేజ్ పార్కులో పిల్లలు సరదాగా గడిపేందుకు దాతల సహకారంతో చిల్డ్రన్ పార్క్ ఏర్పాటు చేసి ఆట సామగ్రి, సిమెంట్ బల్లలు సమకూర్చి, పార్క్ స్థలం చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేసి మోడల్ విలేజ్ పార్క్‌గా తీర్చిదిద్దారు. వివిధ గ్రామాల నుంచి మండల కేంద్రానికి వచ్చే వారు పార్కులో సేదతీరే వారు. పార్కు చుట్టూ పర్యావరణానికి ముప్పు ఉన్న కోనోకార్పస్ మొక్కలు పెంచారు. వీటిని తొలగించి వాటి స్థానంలో ఇతర మొక్కలను నాటాలి. ఆహ్లాదకరమైన వాతావరణం ఉంటుందని భావించిన గ్రామస్తులకు నిరాశే ఎదురవుతోంది. అధికారులు, పాలకులు పార్క్ పునరుద్ధరణకు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

అసాంఘిక కార్యకలాపాలకు అడ్డా



మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన మోడల్ విలేజ్ పార్క్ కొన్ని రోజుల నుంచి సంరక్షణ చర్యలు లేక అ సాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది. అధికారులు పార్కు పునరుద్దరణకు చర్యలు చేపట్టి ఆహ్లాదకరమైన వాతావరణం ఉండేలా చూడాలి. – పవన్ కుమార్, నడికూడ

పార్కును పునరుద్ధరిస్తా



ఇటీవల బదిలీపై రావడం జరిగింది. అధికారుల దృష్టికి తీసుకెళ్లి త్వరలో విలేజ్ పార్క్‌ను పునరుద్దరణ చర్యలు చేపట్టి ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తా.

– సాయిని భిక్షపతి, పంచాయతీ కార్యదర్శి నడికూడ

అన్ని రకాల వడ్లకు బోనస్ చెల్లించాలి

- ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి

కమలాపూర్ : కేవలం సన్న రకాల వడ్లకు మాత్రమే కాకుండా అన్ని రకాల వడ్లకు రూ.500 బోనస్ చెల్లించాలని హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి డిమాండ్ చేశారు. కమలాపూర్, గూడూరు, ఉప్పల్ గ్రామాల్లో పీఏసీఎస్, ఐకేపీ ఆధ్వర్యంలో నెలకొల్పిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను శుక్రవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. ధాన్యం కొనుగోళ్ల సమయంలో కోతల పేరిట రైతులను ఇబ్బందులకు గురి చేయొద్దని, 40 కిలోల బస్తాకు ఒక కిలో మాత్రమే అదనంగా తూకం వేయాలన్నారు. రోజు రోజుకు మారుతున్న వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో విక్రయానికి వచ్చిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు త్వరితగతిన కొనుగోలు చేయాలన్నారు. మిల్లర్లతో పాటు ప్రభుత్వం కూడా ధాన్యం కొనుగోళ్లు సజావుగా సాగేలా చూడాలని, కాంట్రాక్టర్లు తీసుకొచ్చే లారీలపై ఆధారపడకుండా రైతులు ట్రాక్టర్ల ద్వారా తీసుకొచ్చే ధాన్యాన్ని కూడా తీసుకోవాలన్నారు. అంబాల, శ్రీరాములపల్లి, గూనిపర్తి, మాదన్నపేట, శనిగరం, గోపాల్‌పూర్, బత్తినివానిపల్లి, లక్ష్మీపూర్, కానిపర్తి, శంభునిపల్లి గ్రామాలకు సాగు నీరందక చేతికొచ్చే దశలో ఉన్న పంటలు ఎండిపోతున్నాయన్నారు. ఎస్సారెస్పీ డీబీఎం 20, 21, 22, 23, 24 ద్వారా చివరి తడిగా సాగునీరు అందించి రైతులను ఆదుకోవాలని అధికారులు, ప్రభుత్వాన్ని కోరారు. ఈ విషయాన్ని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి దృష్టికి కూడా తీసుకెళ్లినట్లు చెప్పారు. రైతులు సాగు చేసిన పంటలకు సాగునీరు ఇవ్వకుండా ఖమ్మం, సూర్యాపేటకు నీళ్లు తరలిస్తున్నారని, రైతులకు చివరి తడి కోసం సాగు నీళ్లు ఇవ్వని పక్షంలో రైతులతో కలిసి తామే గేట్లు ఎత్తుతామని హెచ్చరించారు. మర్రిపల్లిగూడెం, శనిగరం, శ్రీరాములపల్లి, గుండేడు, నేరెళ్ల, గూనిపర్తి, మాదన్నపేట గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో నెలకొల్పిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్ర జాప్రతినిధులు, అధికారులు, మాజీ ప్రజాప్రతి నిధుల చేతుల మీదుగా ప్రారంభించారు. కార్యక్రమాల్లో ఏఎంసీ చైర్ పర్సన్ ఝాన్సీరవీందర్, వైస్ చైర్మన్ ఐలయ్యగౌడ్, పీఏసీఎస్ చైర్మన్ సంపత్‌రావు, వైస్ చైర్మన్ ఇంద్రసేనారెడ్డి, డైరెక్టర్ సత్యనారాయణరావు, కేడీసీసీబీ డైరెక్టర్ కృష్ణప్రసాద్, డీఎస్ఓ కొంరయ్య, డీఎం మహేందర్, తహసీల్దార్ సురేష్, ఎంపీడీఓ బాబు, తదితరులు పాల్గొన్నారు.

స్కిల్ డెవలప్‌మెంట్ పనులు పూర్తి చేయాలి

- పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి



ల్యాదెళ్లలో పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

దామెర : స్కిల్ డెవలప్‌మెంట్, మినీ మ్యానిఫ్యాక్చరింగ్ సెంటర్ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి అన్నారు. మండలంలోని ల్యాదెళ్ల సాగునీటి పారుదల భవనాల్లో ఏర్పాటు చేస్తున్న స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ పనులను శుక్రవారం ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ సందర్భంగా భవనాల సముదాయాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. త్వరలో ఈజీఎస్ ఆధ్వర్యంలో విరివిగా మొక్కలను నాటాలన్నారు. సైడ్ డ్రైయిన్స్ ఎత్తు పెంచడంతో పాటు పెండింగ్ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ జిల్లా గ్రామీణాభివృద్ధి ఆధ్వర్యంలో వీ–హబ్ సహకారంతో మహిళలకు నైపుణ్య అభివృద్ధి శిక్షణ శిబిరాన్ని ప్రారంభిస్తామని అన్నారు. మహిళలకు ఉపాధి కల్పించడమే లక్ష్యంగా సెంటర్‌ను ఏర్పాటు చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. ఎమ్మెల్యే వెంట డీఆర్డీఓ మేన శ్రీను, ఆర్డీఓ నారాయణ, తహసీల్దార్ జ్యోతివ లక్ష్మీదేవి, ఎంపీడీఓ కల్పన, ఏపీఎం ఝాన్సీ, ఏపీఓ శారద, మండలపార్టీ అధ్యక్షుడు మన్నెం ప్రకాశ్, ప్రధాన కార్యదర్శి భిక్షపతి, వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీనివాస్, శ్రీధర్ రెడ్డి, పోశయ్య, రవి, తదితరులు ఉన్నారు.

తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు చేపట్టాలి



కమలాపూర్ : వేసవికాలం దృష్ట్యా మండల వ్యాప్తంగా తాగు నీటి సమస్య తలెత్తకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని ఎంపీడీఓ గుండె బాబు సూచించారు. ఎంపీడీఓ కార్యాలయంలో ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు, పంచాయతీ కార్యదర్శులతో తాగునీటి సమస్యపై శుక్రవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతీ నెల 1, 11, 21వ తేదీల్లో మంచినీటి ట్యాంకులను తప్పనిసరిగా శుభ్రం చేయించడంతో పాటు క్లోరినేషన్ సక్రమంగా చేయించాలన్నారు. తాగునీటి సరఫరా పైప్‌లైన్ల మరమ్మతులు త్వరితగతిన పూర్తి చేయాలని, ఎక్కడ కూడా గేట్‌వాల్వ్‌ల లీకేజీ లేకుండా చూడాలన్నారు. సమావేశంలో ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ బాలరాజు, ఏఈ లక్ష్మీపతి, ఈఓ రమణారెడ్డి, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ప్రజావ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న ప్రభుత్వం



మాట్లాడుతున్న మాజీ ఉపముఖ్యమంత్రి తాటికొండ రాజయ్య

- మాజీ డిప్యూటీ సీఎం తాటికొండ రాజయ్య

ఎల్కతుర్తి : ఆరు గ్యారంటీల పేరుతో ప్రజలను నమ్మించి గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తుందని మాజీ ఉపముఖ్యమంత్రి తాటికొండ రాజయ్య అన్నారు. శుక్రవారం ఎల్కతుర్తితో పాటు చింతలపల్లి గ్రామ సమీపంలో ఏర్పాట్లు చేస్తున్న బీఆర్ఎస్ రజతోత్సవ సభా స్థలిని ఆయన పరిశీలించారు. అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో రాజయ్య మాట్లాడుతూ మాయమాటలు చెప్పి గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం కేసీఆర్ పథకాలను బిక్షగాళ్లకు వేసినట్లు చేస్తున్నాడని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలే తగిన గుణపాఠం చెప్పే రోజులు దగ్గరపడ్డాయని అన్నారు. యావత్ ప్రపంచం మొత్తం తెలంగాణ అభివృద్ధిని చూసి గర్వించదగేలా చేసిన చరిత్ర బీఆర్ఎస్ పార్టీకే చెందిందన్నారు. 27న నిర్వహించబోయే రజతోత్సవ సభకు భారీ ఎత్తున ప్రజలు, అభిమానులు, నాయకులు తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఆయన వెంట మాజీ ఎమ్మెల్యేలు పెద్ది సుదర్శన్‌రెడ్డి, ఎమ్మెల్సీలు పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, తక్కెళ్ల రవీందర్‌రావు, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు రాకేష్‌రెడ్డి, నాగుర్ల వెంకన్న, చింతం సదానందం, మండల పార్టీ అధ్యక్షుడు పిట్టల మహేందర్, తంగెడ మహేందర్, కడారి రాజు తదితరులు ఉన్నారు.

కూలీలు కనిష్టంగా రూ.307 సంపాదించాలి

- డీఆర్డీఓ మేన శ్రీను



ల్యాదెళ్లలో ఉపాధిహామీ కూలీలతో మాట్లాడుతున్న డీఆర్డీఓ మేన శ్రీను

దామెర : ఉపాధి హామీ కూలీలు కనిష్టంగా రూ.307 సంపాదించాలని డీఆర్డీఓ మేన శ్రీను అన్నారు. మండలంలోని ల్యాదెళ్ల బొమ్మలచెరువు వద్ద చేపడుతున్న చేపల చెరువు పనులను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా హాజరు వెరిఫికేషన్ నిర్వహించారు. కూలీలతో మాట్లాడి పని ప్రదేశంలో ఏర్పాటు చేసిన వసతులపై ఆరా తీశారు. అనంతరం డీఆర్డీఓ మాట్లాడుతూ కనీసం ఐదు గంటలు కొలతల ప్రకారం రూ.307 తగ్గకుండా పనిచేయాలని అన్నారు. ప్రతి గ్రామంలో 100 మంది కూలీలకు తగ్గకుండా పనులకు హాజరుకావాలని పేర్కొన్నారు. వేసవిని దృష్టిలో ఉంచుకొని తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అనంతరం కూలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఆయన వెంట ఏపీఓ శారద, టీఏ సురేందర్, ఆశా కార్యకర్త, ఫీల్డ్ అసిస్టెంట్ తదితరులు ఉన్నారు. అనంతరం ఆయన దామెర మండల కేంద్రంలో నిర్వహిస్తున్న మహిళా కుట్టు శిక్షణ కేంద్రాన్ని పరిశీలించారు.

విద్యుత్ స్తంభాల తొలగింపు

శాయంపేట : మండలంలోని ఆరెపల్లి గ్రామంలో శుక్రవారం 7.1 ఫీట్ల ఎత్తు తక్కువ ఉన్న స్తంభాలను తొలగించి 9.1 ఫీట్ల ఎత్తు గల స్తంభాలను ఏర్పాటు చేసినట్లు విద్యుత్ శాఖ ఏఈ చందూలాల్ తెలిపారు. మలుపుల వద్ద ప్రమాదకరంగా ఉన్న స్తంభాలను తొలగించినట్లు తెలిపారు. అనంతరం ఏఈ మాట్లాడుతూ ఎలాంటి ప్రమాదాలు జరుగకుండా ముందు జాగ్రత్తగా ఎత్తు ఎక్కువ గల స్తంభాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆ యన వెంట జేఎల్ఎం విష్ణు, సిబ్బంది ఉన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ



ఆత్మకూరు : జెన్నయ్య కుటుంబాన్ని పరామర్శిస్తున్న కాళీప్రసాద్

ఆత్మకూరు : మండలంలోని చౌళ్లపల్లిలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన బెజ్జం మహేందర్, బెజ్జం జెన్నయ్య కుటుంబాన్ని శుక్రవారం బీజేపీ రాష్ట్ర నాయకుడు డాక్టర్ కాళీప్రసాద్ పరామర్శించి కుటుంబ సభ్యులను ఓదార్చారు.

శాయంపేట : మండలంలోని తహరాపూర్ గ్రామానికి చెందిన బుస్స సాంబలక్ష్మి శుక్రవారం మృతి చెందగా పరకాల మార్కెట్ మాజీ వైస్ చైర్మన్ రేణికుంట్ల సదయ్య సాంబలక్ష్మి మృతదేహానికి పూల మాల వేసి నివాళులర్పించారు.

రవీందర్ సేవలు చిరస్మరణీయం

- ఎమ్మెల్సీ, మాజీ స్పీకర్ మధుసూదనాచారి



రవీందర్ విగ్రహాన్ని ఆవిష్కరించి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ సిరికొండ

శాయంపేట : తెలంగాణ మలిదశ ఉద్యమంలో జలుగూరి రవీందర్ ఉద్యమానికి చేసిన సేవలు చిరస్మరణీయమని మాజీ స్పీకర్, ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి కొనియాడారు. మండలంలోని కొప్పుల గ్రామంలో తెలంగాణ మలిదశ ఉద్యమకారుడు రవీందర్ మొదటి వర్ధంతి కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఎమ్మెల్సీ రవీందర్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. అనంతరం సిరికొండ మాట్లాడుతూ రవీందర్ తెలంగాణ మలిదశ ఉద్యమంలో చురుగ్గా పాల్గొనేవాడని తెలిపారు. రవీందర్ తెలంగాణ ఉద్యమానికి, బీఆర్ఎస్ పార్టీ బలోపేతానికి ఎంతో కృషి చేశారని కొనియాడారు. అనంతరం రవీందర్ కుటుంబ సభ్యులను పరామర్శించి కుటుంబ సభ్యులకు అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ వంగాల నారాయణరెడ్డి, బీఆర్ఎస్ మాజీ మండల పార్టీ అధ్యక్షుడు గుర్రం రవీందర్, నాయకులు ని మ్మల మహేందర్, బగ్గి రమేష్, గౌస్, రమణారెడ్డి, సమ్మిరెడ్డి, సారయ్య, రాకేష్ పాల్గొన్నారు.

జ్యోతిబాపూలేకు ఘన నివాళి



కమలాపూర్ : పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న నాయకులు



పరకాల : నివాళులర్పిస్తున్న 'మెపా' నాయకులు

బడుగు, బలహీన వర్గాల హక్కులు, అభ్యున్నతి కోసం కృషి చేసిన గొప్ప సంఘ సంస్కర్త జ్యోతిబాపూలే అని వక్తలు కొనియాడారు. మహాత్మ జ్యోతిబాపూలే జయంతి వేడుకలను యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో, ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ శుక్రవారం మండల కేంద్రాలు, ఆయా గ్రా మాల్లో ఘనంగా నిర్వహించారు. జ్యోతిబాపూలే చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమాల్లో కాంగ్రెస్ నాయకులు, ఎమ్మార్పీ ఎస్, ఎంఎస్పీ నాయకులు, మాజీ ప్రతినిధులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు. – సాక్షి, నెట్‌వర్క్



శాయంపేటలో..



ఆత్మకూరులో...



ధర్మసాగర్‌లో..

తప్పుడు ఆరోపణలు చేయడం సరికాదు



మాట్లాడుతున్న గుర్రపు ప్రసాద్

ధర్మసాగర్ : స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరిపై బీఆర్ఎస్ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్యలు తప్పుడు ఆరోపణలు చేయడం సరికాదని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గుర్రపు ప్రసాద్ అన్నారు. మండలంలోని ముప్పారం ఇనుపరాతి గుట్టల శివారులోని భూముల్లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇనుపరాతి గుట్టల్లో అటవీ భూములు 3750 ఎకరాలు ఉన్నాయని, అట్టి భూములను క్షేత్రస్థాయిలో సర్వే చేపట్టకుండా గూగుల్ సర్వే చేపట్టి అటవీ శాఖ భూములతో పాటు రైతులకు చెందిన పట్టా భూములను కూడా అటవీ శాఖకు చెందినవిగా ఆ శాఖ అధికారులు అపోహ పడుతున్నారని ఆరోపించారు. కొంతమంది బీఆర్ఎస్ నాయకులు రాజకీయ ఉనికి కోసం కడియం శ్రీహరిపై తప్పుడు ఆరోపణలు చేయడం మూలంగా ఇందులో రైతులు నష్టపోతున్నారని తెలిపారు. పలువురు రైతులు మాట్లాడు తూ మా తాతలు, తండ్రుల నాటి నుంచి వారసత్వంగా వచ్చిన మా పట్టా భూములను మేమే సే ద్యం చేసుకుంటున్నామని తెలిపారు. సమావేశంలో వెంకట్ రెడ్డి, రమేష్, నాగరాజు, నర్సింహా రెడ్డి, రాజు, శ్రీను, మేష్ రెడ్డి, పాషా, సాంబరాజు, పాల్గొన్నారు.

నేడు వీర హనుమాన్ విజయయాత్ర

ఆత్మకూరు : మండలంలోని గుడెప్పాడ్‌లోని హనుమాన్ దేవాలయం నుంచి హిందూ ధర్మ రక్షణ సమితి ఆధ్వర్యంలో నేడు (శనివారం) వీర హనుమాన్ యాత్ర (బైక్ ర్యాలీ) నిర్వహించడం జరుగుతుందని నిర్వాహకులు శుక్రవారం తెలిపారు. ర్యాలీ సాయంత్రం 4 గంటకు గుడెప్పాడ్‌లోని హనుమాన్ దేవాలయం వద్ద ప్రారంభమై మండల కేంద్రంలోని శ్రీవేణుగోపాలస్వామి ఆలయం వద్ద ముగుస్తుందని పేర్కొన్నారు. హిందువులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

సంక్షిప్త సమాచారం

బడీడు పిల్లల్ని ప్రభుత్వ బడిలో చేర్పించండి



ఐనవోలు: బడీడు పిల్లల్ని ప్రభుత్వ బడుల్లోనే చేర్పించాలని మండల విద్యాధి కారి పులి ఆనందం అన్నారు. శుక్రవారం మండలంలోని పున్నేలు ప్రభుత్వ పాఠశాలలో బడిబాట కరపత్రం-2025ను ఆయన ముఖ్య అతిథిగా హాజరై ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రీ ప్రైమరీ నుంచి 5వ తరగతి వరకు ఆంగ్ల మాధ్యమంలో ఉచిత విద్యాబోధన జరుగుతుందన్నారు. గ్రామంలో ని 4 నుంచి 10 ఏళ్ల వయసు కలిగిన పిల్లల ను పున్నేలు ప్రాథమిక పాఠశాలలో చేర్పించాలని తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ద్వారా మౌలిక వసతుల కల్పనకు నిధులను కేటాయించి పనులు చేయిస్తుందన్నారు. అలాగే బడి నిర్వహణను వారికి అప్పజెప్పిందన్నారు. ఏఏపీసీ చైర్‌పర్సన్ రమ, హెచ్‌ఎంలు రాసుధా రెడ్డి, అన్నారెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విగ్రహ ఏర్పాటుకు అనుమతి ఇవ్వాలి



శాయంపేట : పద్మశాలి ముద్దుబిడ్డ కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహాన్ని మండల కేంద్రంలోని పాత బస్‌షెల్టర్ వద్ద ఏర్పాటు చేసేందుకు అనుమతి ఇవ్వాలని కోరుతూ శుక్రవారం తెలంగాణ రాష్ట్ర పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయంలోని డిప్యూటీ తహసీల్దార్ ప్రభావతికి, ఎస్సై జక్కుల పరమేశ్‌కు, పంచాయతీ కార్యదర్శి మడికొండ రత్నాకర్‌కు విజ్ఞాపన పత్రం అందజేశారు. అనంతరం మండల కేంద్రానికి చెందిన బండారి మణికంఠ ఇటీవల బాసరలోని వేదపాఠశాలలో విద్యుత్‌షాక్ గురై మృతి చెందగా వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర మినిమం వేజెస్ అడ్వైజ్ మెంబర్ బాసాని చంద్రప్రకాష్, బాసాని చంద్రప్రకాష్, పద్మశాలి సంఘం మండల అధ్యక్షుడు సామల మధుసూదన్, మండల గౌరవ అధ్యక్షుడు వావిలాల వేణుగోపాల ప్రసాద్ ప్రకాష్, ఉపాధ్యక్షులు బాసాని చంద్రమౌళి, కార్యదర్శి సామల రవీందర్, గౌరవ సలహాదారులు జలంధర్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

దామెర : విద్యుత్ సరఫరాకు నేడు (శనివారం) అంతరాయం ఏర్పడుతుందని ఏఈ గుర్రం రమేష్ ఒక ప్రకటనలో తెలిపారు. మండలకేంద్రంలోని సబ్‌స్టేషన్‌లో నెలవారి మరమ్మతుల కారణంగా సరఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు. శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని పేర్కొన్నారు. దామెర సబ్‌స్టేషన్ పరిధిలోని దామెర, సింగరాజుపల్లి, ల్యాదెళ్ల, వెంకటాపూర్, ఒగ్లాపూర్, దమ్మన్నపేట, ముస్త్యాలపల్లి, తక్కళ్లపహాడ్ గ్రామాల వినియోగదారులు సహకరించాలని కోరారు.

వేలేరు : మల్లికుదుర్ల, వేలేరు సబ్‌స్టేషన్లలో అత్యవసర మరమ్మతుల కారణంగా ఆయా గ్రామాల్లో శనివారం విద్యుత్ సరాఫరాను నిలిపివేయనున్నట్లు ఏఈ కుమారస్వామి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 నుంచి 11 గంటల వరకు అన్ని 11/కేవీ ఫీడర్లలో త్రీఫేజ్ సరాఫరాను నిలిపివేయనున్నట్లు తెలిపారు.